

అడుగంటిపోతున్న భూగర్భ జలం

- ఎండిపోతున్న బోర్లు, బావులు
- బీడుగా మారుతున్న పంటపొలాలు
- మూగజీవాలకు తప్పని నీటి కష్టాలు
- ఆందోళనలో రైతులు



వెయ్యి అడుగులు లోతులో లేస్తున్న దుమ్ము

జిల్లాలో ఈ ఏడాది వర్షాలు సరిగా పడకపోవడం, నీటి నిల్వలు నిండుకోవడంతోపాటు మండుతున్న ఎండలతో చెరువులు, కుంటలు అడుగంటిపోయాయి. బోర్లు, వ్యవసాయ బావుల్లో నీటిమట్టం పడిపోయింది. చెరువులు, కుంటల్లోనూ నీటి చుక్క లేదు. కనీసం మూగజీవాలకు సైతం దప్పిక తీర్చుకోవడానికి నీరు లేక రైతులు కన్నీరు పెడుతున్నారు.

ప్రజాశక్తి- వి కోట: మండల పరిధిలో భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో ప్రజలకు నీటికష్టాలు తప్పడం లేదు. ఈ సంవత్సరం మండలంలో తగినంత వర్షాలు లేకపోవడంతో ఉన్న కొద్దిపాటి నీటి వనరులు ఆవిరయ్యాయి. ఎండలు మండుతుండడంతో చెరువులు, కుంటల్లోని నీరు ఎండిపోయాయి. దీని వల్ల భూగర్భ జలాలు రోజురోజుకి అడుగంటి పోతున్నాయి. గతంలో మండలంలో సరాసరి బోర్ల లోతు 700 అడుగులు ఉండగా ప్రస్తుతం వెయ్యి అడుగుల పైన బోరు డ్రిల్ చేసిన నీరు వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్న కొద్దిపాటి నీటితో పంటలు పండించిన రైతులు ఉన్న బోర్లలో నీరు హఠాత్తుగా నిలిచిపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో నూతన బోర్లు డ్రిల్ చేస్తున్నారు. భూగర్భ జలాలు ఎండి వెయ్యి అడుగులు బోర్లు డ్రిల్లింగ్ చేసినా దుమ్మే వస్తుండడంతో రైతులకు బెంగ మొదలైంది. ఈ సీజన్లో కూరగాయలకు, పండ్ల తోటలకు ధరలు వస్తాయన్న నమ్మకంతో ఉద్యాన పంటలు పండించేందుకు రైతులు మొగ్గు చూపారు. లక్షల రూపాయలు అప్పులు చేసి పంటలకు పెట్టుబడి పెట్టి సాగు చేస్తున్నారు. అయితే హఠాత్తుగా బోర్లలో నీరు ఇంకిపోవడంతో ఉన్న పంటలకు నీరు ఎలా అనే ఆందోళన ఓ వైపు ఉండగా మరోవైపు నూతన బోర్లు వేసినా నీళ్లు పడక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు.

మూగ జీవాలకు తప్పని నీటి కష్టాలు

మండల పరిధిలోని చెరువులు, కుంటల్లో నీరు ఇంకిపోవడంతో మూగజీవాలు, వన్యప్రాణులు నీటి కోసం అల్లాడుతున్నాయి. మండుతున్న ఎండలకు రైతులు ఆవులు, గొర్రెలకు మేత కోసం తోలుకెళ్లినప్పుడు వాటిని దాహం తీర్చుకోవడానికి తీవ్ర అవస్థలు పడుతున్నాయి పశువులు. ఎండల తీవ్రతకు నీటి జాడలు కనుమరుగు అవ్వడంతో అటవీ సరిహద్దు ప్రాంతాల్లోని వన్య ప్రాణులు సైతం నీటి కోసం అవస్థలు పడుతున్నాయి. సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు చొరవ చూపి వన్యప్రాణులు మూగజీవాల కోసం నీటి తొట్టెలను ఏర్పాటు చేసి అందులో నీరు నింపే విధంగా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

దోచుకుంటున్న బోరు బండి యజమానులు..

పలమనేరు నియోజకవర్గంలో బోరు బండ్ల యజమానులు రైతుల అవసరాలను అదునుగా చేసుకొని మండలానికి అడుగుకు ఒక రేట్ పెట్టి రైతులను నిలువునా దోచుకుంటున్నారు. మొదటి 300 అడుగుల వరకు అడుగుకు వంద రూపాయలు చొప్పున, కొన్ని మండలాల్లో 110 రూపాయలు చొప్పున రేట్లు వసూలు చేస్తున్నారు. అనంతరం ప్రతి 100 అడుగులకు ఐదు రూపాయలు చొప్పున రేట్లు పెంచుతున్నారు. డీజిల్ ధరలు పెరగకపోయినా, కర్ణాటక సరిహద్దుల్లో పెట్రోల్ బంకుల్లో తక్కువ ధరలకు డీజల్ పట్టినా రైతులు వద్ద కనికరం లేకుండా ముక్కుపిండి అధికంగా అడుగుకు ఐదు రూపాయలునుండి పది రూపాయలు వరకు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం అర్హులైన రైతులకు ఉచిత బోర్లు మంజూరు చేసి, బోరు యజమానులు ధరలను ప్రభుత్వం నిర్ణయించిన రేట్లకే బోర్లు వేసే విధంగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

తాగునీటి సమస్యలు పరిష్కరిస్తాం..
- గోవిందప్ప శ్రీనివాసులు, జెడ్పి ఛైర్మన్



గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా తక్షణ చర్యలు చేపట్టి శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు చేపట్టాం. గ్రామాల్లో గ్రామపంచాయతీ మండల పరిషత్తు నిధులతో పాటు జెడ్పి నిధులతో నూతన బోర్లు మంజూరు చేసి పనులు పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాం. మండలాల పరిధిలోని గ్రామాల్లో తాగునీటి సమస్యల పరిష్కారం పట్ల తీసుకున్న చర్యలను సంబంధిత అధికారుల ద్వారా గుర్తించిన సమస్యల పరిష్కారానికి మొదట ప్రాధాన్యతన్నాం. ఈ సంవత్సరం తగినంత వర్షపాతం నమోదు కాకపోవడంతో మండల పరిధిలో భూగర్భ జలాలు అనుకున్న స్థాయిలో మెరుగుపడలేదని దీని ప్రభావంతో తాగునీటి బోర్లలో నీరు అడుగంటే ప్రమాదం ఉందని గ్రామపంచాయతీల సర్పంచ్లు కార్యదర్శులు అప్రమత్తంగా వ్యవహరించాలి. తాగునీటి సమస్యలు పరిష్కారానికి నిధులు కొరత లేదు, అందుబాటులో ఉన్న ప్రభుత్వ నిధులను సద్వినియోగం చేసుకుని తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించాం.

బోర్లలో నీటికి బదులు దుమ్ము వస్తోంది..
- శ్రీనివాసులు, రైతు, దేవరాజుపురం




మండల పరిధిలోని దేవరాజుపురంలో ఉన్న రెండు ఎకరాల పొలంలో దాదాపు 16 బోర్లు వేసాం. ఒక్కదానిలో కూడా నీరు రాలేదు ఒట్టి దుమ్మే మిగిలింది. ఇద్దరు బిడ్డలను చదివించేందుకు బోర్లనే నమ్ముకుని అప్పుల పాలయ్యాం. ఉపాధి కోసం ట్రాక్టర్ల ద్వారా నీళ్లు తోలుకొని కోళ్ల ఫారాన్ని నడుపుతున్నాం. ఈ దిగులుతో అనారోగ్యంపాలై అప్పులు చేసి ఆసుపత్రులు చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇదేవిధంగా మండల పరిధిలోని దాదాపు బోర్లు వేసిన అందరు రైతులు అప్పులు ఊబిలో కూరుకుపోయారు. ప్రభుత్వం బోర్లు ద్వారా నష్టపోయిన రైతులను గుర్తించి ఆర్థిక సహాయం అందించాలి.

రైతుల భూముల్లో సాగునీటి కోసం బోర్లు వేస్తున్న దృశ్యం



కా(ర్మి)(క్వారీ) ర్మికులకు భద్రత కరువు..

- జిల్లాలో 300లకు పైగా క్వారీలు
- నిబంధనలు పాటించని యాజమాన్యాలు
- ఇబ్బంది పడుతున్న చుట్టుపక్కల ప్రజలు
- గ్రానైట్స్ పేలుళ్లతో భయాందోళనలో జనం





ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

జిల్లాలో 300లకు పైగా నగిరి నుండి కుప్పం వరకు క్వారీలు, గ్రానైట్స్ రోజురోజుకు విస్తరిస్తూ ప్రజాప్రకృతి సంపదను కొల్లగొడుతున్నాయి. మరోపక్క అందులో పనిచేస్తున్న కార్మికులను కనీస వేతనాలు ఇవ్వడకుండా శ్రమదోపిడి చేస్తున్న యాజమాన్యాలు వారి భద్రత గురించి పట్టించుకుంటున్న పాపాన పోవడం లేదు. జిల్లాలోని క్వారీల్లో దాదాపు 15 వేల మంది కార్మికులు ప్రత్యక్షంగానూ మరో 10 వేల మంది పరోక్షంగా పని చేస్తున్నారు. నగిరి ప్రాంతంలో క్వారీలు గ్రానైట్ల వల్ల చుట్టుపక్కల గ్రామప్రజలు బాంబు పేళ్ళలకు భయభ్రాంతులకు గురవుతూ ప్రాణాలకు గుప్పెట్లో పెట్టుకుంటున్నారు దీనికి తోడు వాటి నుంచే వ్యర్థాలు దుమ్ము, ధూళి వలన అనారోగ్యాలు గురవుతున్నారు ఇంత జరుగుతున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోని పరిస్థితి నెలకొంది.

యాదమరి మండలంలో అక్రమంగా క్వారీలు నిర్వహిస్తున్నారు. ఆ క్వారీలో పనిచేస్తున్న కార్మికులకు మాత్రం కనీస వేతనాలు కూడా సక్రమంగా ఇవ్వడం లేదు. అదేవిధంగా పుంగనూరు, కుప్పం ప్రాంతంలో అత్యధికంగా క్వారీలు ఉన్నాయి. ఇక్కడ కూడా అదే పరిస్థితి. క్వారీలలో ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ఎవరికీ తెలియకుండా యాజమాన్యం తూతూ మంత్రంగా మృతుల కుటుంబాలకు డబ్బులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. తక్కువ కూలీ ఇస్తూ కార్మికుల నుంచి ఎక్కువ పని చేయించుకుంటూ భారీగా శ్రమ దోపిడీ చేస్తున్నారు. దీనిపై జిల్లాలో ఉన్న మైనింగ్ అధికారులు కూడా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు, ఇక లేబర్ అధికారుల పరిస్థితి మరీ దారుణంగా ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. కార్మిక చట్టాలు ప్రకారం క్వారీ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని జీవోలు ఉన్నప్పటికీ ఏ క్వారీలోను అమలు చేయని పరిస్థితి ఉంది. క్వారీలో పని చేయడం చాలా ప్రమాదకరమైన పని, అంత ప్రమాదకరమైన పని చేస్తున్న కార్మికులకు మాత్రం కనీస భద్రత ఉండడం లేదు. ఎక్కడా కనీస నియమాలు పాటిస్తున్న దాఖలాలు లేవు..

కనీస వేతనాలు అమలు చేయాలి
- వాడ గంగరాజు, సిఐటియు జిల్లా అధ్యక్షులు



జిల్లాలో 300కు పైగా క్వారీ అండ్ గ్రానైట్ పరిశ్రమలో ఉన్నప్పటికీ ఒకచోట కూడా వారి కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకపోవడం దుర్మార్గం. కార్వీల్లో ప్రమాదాలు జరిగినప్పుడు అసలు ఎవరికీ తెలీకుండా యాజమాన్యాలు తూతూ మంత్రంగా వారికి వైద్యం అందించి చేతులు దులుపుకుంటున్నారు. కార్మికులు బయటి ప్రాంతాల నుంచి వచ్చిన వారు కావడంతో చనిపోతే వారికి ఎవరు దిక్కులేని పరిస్థితి ఉంది. లేబర్ అధికారులు, పరిశ్రమలశాఖ అధికారులు ఎవరూ కూడా పట్టించుకోని పరిస్థితిలో గ్రానైట్స్‌లో పనిచేస్తున్న కార్మికులు ఉన్నారు. ప్రభుత్వం నుండి అన్ని రకాల మినహాయింపులు తీసుకుంటున్న యాజమాన్యాలు లక్షలు లాభాలు గడిస్తూ అటు పంచాయతీ కార్యాలయానికి కట్టాల్సిన పన్నులు ఎగ్గొడుతున్నారు. మరోపక్క కార్మికుల దగ్గర నుంచి శ్రమ దోపిడీ చేయించుకుంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించి వేతనాలు ఇవ్వని యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి.

చెరువుల సంరక్షణకు అధిక ప్రాధాన్యత: కలెక్టర్

ప్రజాశక్తి- గుడిపాల: భూగర్భ జలాల పెంపు, సాగునీటి అవసరాల కోసం చెరువులను సంరక్షించాలని, రానున్న వర్షాకాలం కంటే ముందు చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్, ఎమ్మెల్యే గుడిపాల మండలం రామిరెడ్డి చెరువు, రెడ్డమ్మ చెరువు, నారాయణరెడ్డి చెరువు, బంగారక్క చెరువులను పరిశీలించారు. అనంతరం ఆయకట్టుదారులు, రైతులు, అధికారులతో మాట్లాడారు. చెరువుల్లో పూడిక పేరుకపోవడం, ఆక్రమణలు జరగడంతో నీటిసామర్థ్యం తగ్గిపోయిందని ఆయకట్టుదారులు ఎమ్మెల్యే, కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన కలెక్టర్ చెరువుల ఆక్రమణలపై సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఇదే సమయంలో చెరువులో పూర్తిస్థాయిలో పూడిక తొలగించేందుకు సత్వరం అంచనాల రూపొందించి, తీర్మానం చేయించి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద ఒక్కొక్క చెరువులో రూ.40లక్షలతో పనులు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. బంగారక్క చెరువుకట్ట పటిష్టతకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం కారణంగా చెరువులో పేరుకుపోయిన మట్టిపై ఎమ్మెల్యే, స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా సత్వరం స్పందించి మట్టిని తొలగించాల్సిందిగా నేషనల్ హైవే పీడీని ఆదేశించారు. చెరువు నుంచి ఇంకో చెరువుకు వచ్చే సప్లై ఛానల్ ను సర్వే చేసి పూర్తిస్థాయిలో నీటి ప్రవాహానికి వీలుగా సిద్ధం చేయాలన్నారు. ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ మాట్లాడుతూ వర్షాలు ప్రారంభం కంటే ముందుగానే చెరువుల్లో పూడికతీత పనులు పూర్తి చేసేలా అధికారులు వేగంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ వెంకటేశ్వరరాజు, ఈఈ మురళీ కుమార్, ఎంపీడీఓ శిరీష, తహశీల్దార్ జయంతి, ఏఈ సయ్యద్ పీరా, నాయకులు సుబ్రహ్మణ్య నాయుడు ,మురళి, అర్జున్ పాల్గొన్నారు.


చెరువుల సంరక్షణకు తీసుకోవల్సిన చర్యలపై చర్చిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

గంగ జాతరలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరులో వైభవంగా నిర్వహించే నడివీధి గంగమ్మ జాతర సందర్భంగా అమ్మవారిని జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి దర్శించుకున్నారు. జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం గిరింపేటలో గంగమ్మను దర్శించుకున్న అనంతరం నడివీధి గంగమ్మ జాతరలో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌తో కలిసి మంత్రి పాల్గొన్నారు. నడివీధి గంగమ్మ ఆలయ ధర్మకర్త, మాజీ శాసనసభ్యులు సీకే బాబు అమ్మవారి ప్రసాదాలను మంత్రికి అందజేశారు. అనంతరం మురుకంబట్టు, దొడ్డిపల్లిలలో ప్రతిష్ఠించిన అమ్మవార్లను మంత్రి దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మంత్రితో పాటు నగర మేయర్ ఆముద, చుడా చైర్ పర్సన్ కటారి హేమలత, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ, ఎంఎల్‌ఎ దొరబాబు, పిఎస్.మనోహర్, చల్లా బాబు తదితరులు పాల్గొన్నారు.




జాతర ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ


జాతర సందర్భంగా బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు పరిశీలించారు. గంగమ్మ విగ్రహాల నిమజ్జనం సందర్భంగా పోలీసు బందోబస్తు, ట్రాఫిక్ మళ్లింపుపై జిల్లా ఎస్పీ మాట్లాడారు. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా జాతర నిర్వహించే ప్రదేశాలలో ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందని కావున ప్రజలు దీనిని గమనించి ఇతర మార్గాలు ఎంచుకోవాలని, జాతర ముగిసేవరకు పోలీసు వారికి సహకరించాలని కోరారు. భక్తుల రక్షణార్థం భద్రత చర్యలలో భాగంగా బ్యారికేడ్లు ఏర్పాటు చేసామని, పిక్ పాకెటింగ్, ఆకతాయిల వెకిలి చేష్టల నివారణకు నిష్ణాతులైన క్రైమ్ సిబ్బందితో ప్రత్యేక క్రైమ్ బృందాలు ఏర్పాటు చేసి నిరంతరం నిఘా ఉంచామని అన్నారు. అలాగే సిసి కెమెరాలు ఇప్పటికే అమర్చామని దానిని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్‌కి అనుసందానం చేసి నిరంతరం పోలీసులతో పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. పట్టణంలో జరిగే ప్రముఖ జాతరను దృష్టిలో ఉంచుకొని ప్రజల శాంతి భద్రతల పరిరక్షణకు బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఏదైనా సమస్య ఉంటే మీ దగ్గరున్న పోలీసులకు లేదా డయల్ 112 , పోలీసు వాటాప్స్ నెంబర్ 94409 00005కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

అగ్గిపెట్టె మీద గంగమ్మ చిత్రం

యాదమరి చిత్రకారుని ప్రతిభ

ప్రజాశక్తి- యాదమరి: ప్రముఖ చిత్రకారులు, యాదమరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆర్ట్ మాస్టర్ కె.దామోదరాచారి అగ్గిపెట్ట మీద గంగమ్మ చిత్రాన్ని రూపొందించారు. తిరుపతి, చిత్తూరు, గుడియాత్తం గంగమ్మ జాతర ఒకేరోజు జరగడం విశేషం. ఈ సందర్భంగా 'కుక్కపిల్ల, అగ్గిపుల్ల, సబ్బుబిల్ల హీనంగా చూడకు దేన్నీ కవితామయమేనోయ్ అన్నీ' అన్న మహాకవి శ్రీశ్రీ కవితే ప్రేరణగా వైవిధ్యంగా అగ్గిపెట్టెపై గంగమ్మ లఘు చిత్రాన్ని చిత్రించడం జరిగింది. చిత్రం 4 సెంటీమీటర్లు పొడవు, 3 సెంటీమీటర్ల వెడల్పుతో చిత్రించడం జరిగింది. ప్రతి సంవత్సరం గంగమ్మ జాతరకు ప్రత్యేకంగా అప్పటికప్పుడు స్పందించి గంగమ్మ కరుణాకటాక్షాలతో స్ఫురించగా చిత్రాలు చిత్రిస్తున్నట్టు దామోదరాచారి తెలిపారు.




యాదమరి ఆర్ట్ ఉపాధ్యాయుడు దామోదరచారి

పెండింగ్ జీతాలు ఇవ్వాలని

పారిశుధ్య కార్మికుల నిరసన




ఆసుపత్రి ఎదుట నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు మున్సిపాలిటీలో ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న 15 మంది పారిశుద్ధ కార్మికులకు గత మూడు నెలలుగా జీతాలు ఇవ్వలేదని, వెంటనే తమకు జీతాలు చెల్లించాలని కోరుతూ ఆసుపత్రి ఎదుట నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా అధ్యక్షుడు గిరిధర్ గుప్తా లోకేష్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు మంగళవారం విధులను బహిష్కరించి ఆసుపత్రి ఎదుట నిరసన తెలిపారు. ఈసందర్భంగా గిరిధర్ గుప్తా మాట్లాడుతూ మూడు నెలలు జీతాలు కార్మికులకు ఇవ్వాల్సి ఉందని, నాలుగో నెల కూడా జరుగుతున్నా ఇప్పటికీ జీతాలు చెల్లించకపోవడం దారుమణమని అన్నారు. నెలవారీ జాతాలపై ఆధారపడి జీవించే కార్మికులకు ఇలా నెలల తరబడి జీతాలు చెల్లించకుంటే వారు ఎలా జీవనం సాగించాలని ప్రశ్నించారు. పలమనేరులో గంగమ్మ జాతర 14 ,15, 16వ తేదీన జరుగుతున్నా పారిశుధ్య కార్మికులు మాత్రం పండుగ జరపుకోలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పై అధికారులు జోక్యం చేసుకుని వెంటనే పారిశుధ్య జీతాలు చెల్లించాలని, వారి సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామకృష్ణ, గీత, శ్యామల, బుజ్జమ్మ, ఈశ్వరమ్మ, విజయమ్మ, నారాయణమ్మ, లలిత, ఏకాంబరం, కుమార్ పాల్గొన్నారు.

పిహెచ్‌సిల్లో వైద్యులు అందుబాటులో ఉండాలి: జెడ్‌పి ఛైర్మన్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రజలకు సకాలంలో వైద్యసేవలు అందించేందుకు పిహెచ్‌సిలలో డాక్టర్స్ అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని జెడ్‌పి ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జెడ్పి ఛైర్మన్ అధ్యక్షతన 1 నుండి 7 (ప్రణాళిక, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, విద్యా, వైద్యం, మహిళా సంక్షేమం, సాంఘిక సంక్షేమం) ఆర్థిక పనుల స్థాయి సంఘాలు సంబంధించిన సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జెడ్‌పి సిఈఓ రవి కుమార్ నాయుడు, డిప్యూటీ సిఈఓ జుబేదా బేగం, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెడ్పి ఛైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్యరంగానికి అధిక ప్రాధాన్యతను ఇస్తున్నదని ప్రజలకు సత్వరమే వైద్య సేవలు అందించేందుకు అనుగుణంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో డాక్టర్లు సిబ్బంది సకాలంలో అందుబాటులో ఉండడం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందని ఈ దిశగా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పనిచేయాలని సూచించారు. స్థాయి సంఘ సమావేశాలలో వివిధ అంశాలపై జరిగిన చర్చలో సభ్యులు చర్చించిన అంశాల పై సంబంధిత శాఖలకు చెందిన అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి అధిక ప్రాధాన్యతస్తున్నట్లు తెలిపారు. డిఆర్డిఏ ద్వారా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ప్రతినెలా 5,60,785 మందికి పెన్షన్లు పంపిణీ చేపడుతున్నామని, ఏప్రిల్ 2024 నుండి ఏప్రిల్ 2025 వరకు రూ.2,585 కోట్లు పంపిణీ చేశామని తెలిపారు. 2024- 25 సంవత్సరానికి బ్యాంక్ లింకేజీ ద్వారా 29,426 మందికి రూ.2970 కోట్లు, స్త్రీ నిధి ద్వారా 67,535 స్వయం సహాయక సభ్యులకు రూ.427.92 కోట్లు పంపిణీ చేశామని డిఆర్‌డిఏ అధికారులు వివరించారు. గృహనిర్మాణ శాఖ ద్వారా ఉమ్మడి జిల్లా పరిధిలో నిర్మాణాలు చేపట్టిన 1,54,314 గృహాలకు గానూ 92,245 గృహ నిర్మాణాలు పూర్తి చేయడమైనదని, గృహ నిర్మాణాలకు రూ.2100.28 కోట్లు ఖర్చు చేశామని, 847 లే ఔట్లకు రూ.102 కోట్ల వ్యయంతో నీటి వసతి కల్పించామని గృహ నిర్మాణ శాఖ పీడీ వివరించారు. అలాగే 2024-25 వ విద్యా సంవత్సరానికి గానూ ఉమ్మడి జిల్లాలో 4,737 పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పథకంలో భాగంగా 2,85,900మంది విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహార భోజనం అందిస్తున్నామని డీఈఓ తెలిపారు. ఎన్‌టిఆర్ వైద్యసేవ ద్వారా ఏప్రిల్ 2024 నుండి మార్చి 2025 వరకు 35905 మందికి చికిత్సలు చేశామని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వివరించారు. పంచాయతీ రాజ్‌శాఖ ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఉమ్మడి జిల్లాలో ఎంజిఎన్ఆర్ ఈజిఎస్ ద్వారా రూ.19 కోట్లతో 3480 సిసి రోడ్డుల నిర్మాణ పనులను ప్రారంభించి 2913 పనులు పూర్తి చేశామని, ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన కింద రూ.18 కోట్లతో 23 పనులు మంజూరు చేశామని పంచయతీ రాజ్ ఎస్ఈ వివరించారు. గ్రామీణ నీటి పారుదలశాఖ ద్వారా ఉమ్మడి జిల్లాలో జల్ జీవన మిషన్, ఎంపి ల్యాడ్స్, జెడ్‌పి పనులు మొత్తం 5880 పనులు మంజూరు చేసి రూ.17.15 కోట్లతో 4,213 పనులు పూర్తి చేశామని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సభకు వివరించారు. జిల్లాలో వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్యను అధిగమించడానికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రహదారులు భవనముల శాఖ ద్వారా జిల్లాలో గుంతలు పూడ్చే కార్యక్రమం కింద రూ.20.96 కోట్లతో 289 పనులు మంజూరు కాగా 284 పనులు పూర్తి చేయడం జరిగిందని, ఎండిఆర్ ప్లాన్ కింద 42 పనులు రూ.26.53 కోట్లతో మంజూరు కాగా పనులు పూర్తి చేయడం జరిగిందని ఆర్ అండ్ బి అధికారులు వివరించారు. వ్యవసాయ యాంత్రికరణలో భాగంగా 2024 - 25 సంవత్సరానికి గాను మార్చి 25 నందు 2,867 వ్యక్తిగత వ్యవసాయ పనిముట్లను రూ.5.5కోట్లతో మంజూరు చేయడం జరిగిందని, ఇందులో ఇప్పటి వరకు 2,377 పనిముట్లతకు రూ.3.79 కోట్ల సబ్సిడీతో 2,377 మంది రైతులకు అంద జేయడం జరిగిందని వ్యవసాయ అధికారి సభలో వివరించారు. ఉద్యానవన శాఖ ద్వారా ఉద్యాన పంటల విస్తరణ పథకం కింద 40 శాతం రాయితీతో మామిడి, దానిమ్మ, అరటి, బొప్పాయి, అవకాడో, తదితరుల పంటసాగు విస్తీర్ణం పెంచడానికి రాయితీ అందించడం జరుగుతున్నదని, సామూహిక వ్యక్తిగత పంటకు పంటలకు 50శాతం రాయితీపై నీటి వసతిని కల్పించడం జరుగుతుందని, మామిడి కాయల నాణ్యత పెంచడానికి కవర్లు అందజేస్తున్నామని ఉద్యానశాఖ అధికారి వివరించారు. పిఆర్, ఆర్‌డబ్ల్యుఎస్‌ఈలు చంద్రశేఖర్ రెడ్డి, విజయ్ కుమార్, డ్వామా పీడీ రవికుమార్, హౌసింగ్ పీడీ గోపాల్ నాయక్, డీఈఓ వరలక్ష్మి, సమగ్ర శిక్ష ఏపీసి వెంకటరమణ, ఐసిడిఎస్ పీడీ వెంకటేశ్వరి, జిల్లా వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు మురళీకృష్ణ, మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్మన్ శ్రీనివాసులు

రేపు మండల సర్వసభ్య సమావేశం

ఇన్‌ఛార్జి ఎంపీడీవో శ్రీధర్

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: మండల సర్వసభ్య సమావేశం గురువారం 10 గంటలకు ప్రారంభమవుతుందని ఇన్‌ఛార్జి ఎంపీడీవో శ్రీధర్ బుధవారం తెలిపారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు మండల స్థాయి అధికారులు హాజరు కావాలని సూచించారు. మండల స్థాయి అధికారులు గతంలో ఇచ్చిన సమాచారం మేరకు సమాచారాన్ని ముందు తెలపాలని సమావేశానికి హాజరయ్యేటప్పుడు ఆ శాఖకు సంబంధించిన పూర్తి సమాచారంతో సమావేశానికి రావాలని కోరారు. ప్రతి అంశం ప్రస్తావించి ప్రజల అవసరాల కోసం ప్రజాప్రతినిధులు పని చేస్తున్నారని వారికి కావాల్సి సమాచారాన్ని అధికారులు అందించడంలో నిర్లక్ష్యం వహించకూడదని అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం


కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -కార్వేటినగరం: రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణు గోపాల స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం ఆలయంలో వేదపండితులు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భం గా వేకువ జామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చనలు , అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అర్చకులు పచ్చకర్పూరం, కిచ్చిలి ఆకు, చందనం, పసుపు, వంటి సుగంధ ద్రవ్యాలను కలిపి వేద పండుతులు వేద మంత్రాల నడుమ మాడ వీధుల్లో ఊరేగించారు. ఆలయ గర్భగుడి గోడలను సుగంధ ద్రవ్యాలను పూసి శుద్ధి చేశారు. అనంతరం స్వామిని పట్టు వస్త్ర సుగంధ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఆలయ అధికారి సురేష్ కుమార్, ఆర్చకులు రమేష్, శబరిష, గోపాల ఆచారి, షరాబ్ బాబు సురేష్, వేదంపండితులు శర్మ, పలువురు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - వెదురుకుప్పం: వెదురుకుప్పం మండలం పచ్చికాపలం విరాటపురం రోడ్డులో వెలసిన తిరుపతి గంగమ్మ ఆలయంలో జాతర సందర్భంగా మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఎల్ ధన శేఖర్ శెట్టి, స్థానికులు, మహిళలు అమ్మవారికి పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. భక్తులకు పూజారి తీర్థ ప్రసాదాలను అందించారు.


సర్టిఫికెట్లు అందుకున్న శిక్షణలో పాల్గొన్న అధ్యాపకులు

ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ విజయవంతం

ప్రజాశక్తి- కుప్పం రూరల్ : కుప్పం ఇంజినీరింగ్ కళాశాలలో వారం రోజుల పాటు నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ మంగళవారం విజయవంతంగా ముగిసింది. కర్నూలుకు చెందిన అసెనార్ టెక్నాలజీస్, ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిసిఎన్ విద్యాసంస్థల అధినేత బిసి నాగరాజు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రకమైన శిక్షణా కార్యక్రమాలు అధ్యాపకుల దృష్టిని పరిశోధన, నూతన ఆవిష్కరణల వైపు మళ్లిస్తుందన్నారు. విద్యార్థులకు మార్గనిర్దేశం చేయడంలో అధ్యాపకుల పాత్ర అత్యంత కీలకమని, ఇలాంటి కార్యక్రమాలను అధ్యాపకులు సద్వినియోగం చేసుకోవడం వల్ల ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని, విద్యార్థులకు ఉత్తమ శిక్షణను అందించడానికి ఉపకరిస్తుందన్నారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న అధ్యాపకులకు, రిసోర్స్ పర్సన్స్‌కు ధ్రువ పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ డాక్టరు ఎన్ సునిల్ రాజ్, ప్రిన్సిపల్ డాక్టరు ఎస్ సుధాకర్ బాబు, డాక్టరు కె రాసదురై, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు, సెక్షన్ ఇన్‌చార్జులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

ప్రజాశక్తి - పలమనేరు: పలమనేరులో గంగమ్మ జాతర సందర్భంగా 13వ రోజు మంగళవారం ఉదయం 10 గంటలకు కురబ, గౌడ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అన్నదానం చేశారు. ఇందులో భాగంగా పలమనేరు నియోజకవర్గం కురుబ, గౌడ సంఘం వారు ఉదయం తొమ్మిది గంటలకు పలమనేరు ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ వద్ద నుంచి పూజ చేసి అటు తరువాత గంగమ్మ గుడికి మేళ తాళాలు, బళ్లారి డ్రమ్స్, కోలాట్లు , పిల్లనుగ్రోవులు , శివపార్వతుల వేషధారణలతో ఊరేగింపుగా బయలుదేరి, గంగమ్మ గుడి చేరి, గంగమ్మకు ప్రత్యేక అభిషేకం, పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదం వితరణ చేశారు.


కిశోరి బాలికలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

బాలికల భద్రతే లక్ష్యం

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: బాలికల భద్రతే ప్రధాన లక్ష్యంగా కిశోరి వికాసం పై అవగాహన కల్పించేందుకు అవగాహన శిబిరం నిర్వహించారు. మంగళవారం గంగాధర నెల్లూరు మండల పరిధిలోని అప్పిరెడ్డి కండిగ గ్రామంలో నిర్వహించిన ఈ అవగాహనలో జిల్లా లీగల్ అడ్వైజర్ వెంకటేష్ మాట్లాడుతూ బాలికల సంరక్షణ కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రధానంగా బాలికల సంరక్షణలో భాగంగా గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పోస్కో చట్టం, చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098, అయితే అంశాలపై వివరాత్మకమైన విషయాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిపిఓ స్టాప్ షణ్ముగం, నెల్లేపల్లి మహిళా పోలీస్ మౌనిక, అంగన్వాడీ కార్యకర్తలు నిర్మల, ప్రమీల, చిట్టెమ్మ, పావని పాల్గొన్నారు.

ఉర్దూ డిఐ పోస్టులు భర్తీ చేయాలి


సయ్యద్ ఇక్బాల్ రాష్ట్ర అధ్యక్షులు
సయ్యద్ ముష్తాక్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి

ప్రజాశక్తి -యాదమరి: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న11 జిల్లాలలో చిత్తూరు, కర్నూలు, అనంత పురం, కడప, కృష్ణ, ,గుంటూ రు, బాపట్ల, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరి, నెల్లూరు, ప్రకాశం జిల్లాల ఉర్దూ డీఐ (డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్, ఉర్దూ రేంజ్) పోస్టులు అర్హులైన వారితో భర్తీ చేయాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సయ్యద్ ఇక్బాల్ , సయ్యద్ ముష్తాఖ్ సంయుక్త ప్రకటనలో కోరారు. ఉర్దూ పాఠశాలల పర్యవేక్షణకు, విద్యార్థుల విద్యాభివృద్ధికి ,ఉర్దూ ఉపాధ్యాయులకు మార్గదర్శకులుగా ఉర్దూ డిఐ లు ఎంతో దోహదపడతారని, ఉర్దూ డిఐ లు లేని కారణం గా గత దశాబ్ద కాలంగా ఉర్దూ పాఠశాలలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎంతో నష్టపోయాయరని ఉర్దూ డిఐ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఇంత చిన్న వయసులో ఎంత కష్టమో..?

- కుశస్థలిలో ఈతకు వెళ్లి చిన్నారి మృతి - వారం క్రితం అనారోగ్యంతో తల్లి మృతి
- కర్మ క్రియలకు ముందే కార్తీక్ మృతి - గ్రామంలో విషాద ఛాయలు


మృతుడు కార్తీక్


వారం క్రితం మృతి చెందిన కార్తీక్ తల్లి నందిని


అనాథలుగా మిగిలిన కార్తీక్ అన్నా చెల్లెలు

ప్రజాశక్తి -ఎస్ఆర్ పురం: తల్లిని మించిన యోధురాలు ప్రపంచంలోనే లేదు.. బిడ్డకు ఓ వజ్రాయుధం తండ్రి. తల్లిబిడ్డల దగ్గర ఉంటే తాను కష్టపడుతూ చెమట రూపంలో రక్తాన్ని చిందిస్తూ కంటికి రెప్పలా బిడ్డలను కాపాడుకుంటూ వారికి విద్యాబుద్ధులు నేర్పించి కష్టసుఖాలను తెలిపి పెంచుకుంటూ తనలో తానే మురిచిపోతూ ఉంటుంది. తండ్రి బిడ్డల కోసం కష్టపడుతూ వారి జీవితాన్ని ఒక దారిలో పెట్టేటందుకు నిత్యం శ్రమిస్తూ ఆలోచించే వాడే తండ్రి. ఆ బిడ్డలకు తండ్రి ఉన్నా తెలియదు.. తెలిసిన తల్లి మృతి చెందింది ఆమెకు కర్మ క్రియలు తీరకముందే వారి సంతానంలో రెండో కుమారుడు స్నేహితులతో పాటు ఈతకు వెళ్లి మంగళవారం ఏటిలో మృతదేహమై కనిపించాడు. ఇద్దరు బిడ్డలు అనాథలుగా మిగిలారు.

గంగాధర నెల్లూరు నియోజక వర్గ పరిధిలో ఎస్ఆర్ పురం మండలం ఉడుములకుర్తి పంచాయతీ పివిపురం దళితవాడలో సురేష్ నందిని ఉండేవారు . వీరికి పది సంవత్సరాల క్రితం వివాహమైంది. ఈ దంపతులకు ముగ్గురు సంతానం ..మొదటి సంతానం రితిక్ రోషన్ నాలుగవ తరగతి, మృతుడు రెండవ సంతానం కార్తీక్ రెండవ తరగతి ప్రాథమిక పాఠశాల చదువుతారు. మూడో సంతానం దీక్షిత ..నాలుగు సంవత్సరాలు.. పివిపురం లో అంగన్‌వాడీ కేంద్రంలో చదువుతోంది. వేసవి సెలవులు కావడంతో ఇంటిపట్టునే ఉంటూ ఆట్లాడుకుంటు ఉండేవారు. ఈనెల మే రెండవ తేదీ తల్లి నందిని (27) అనారోగ్యంతో మృతి చెందారు . బుధవారం ఆమె కర్మ క్రియలను బంధువులు నిర్వహించనున్నారు. మృతుడు కార్తీక్ స్నేహితులతో కలిసి సమీపంలో ఉన్న కుశస్థలి వాగులో నీటి కుంటలో ఈత కొట్టేందుకు వెళ్లాడు. నీళ్ల లోతు ఎక్కువగా ఉన్న ప్రాంతానికి వెళ్లి మునిగిపోయాడు. విషయం గమనించిన స్నేహితులు కేకలు వేసి పరుగులు తీసి గ్రామంలో పెద్దలకు తెలిపారు. వారు వచ్చి వెతికేలోపే విగత జీవిగా కల్పించాడు. తల్లి కర్మ క్రియ పూర్తి కాకముందే ఆ తల్లి రెండో సంతానం కార్తీక్ మృతి చెందడంతో ఆ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఉన్న పిల్లలకు ఆ తండ్రి ఎక్కడుంటాడో ఏమి చేస్తుంటాడో తెలియని నిస్సహాయ పరిస్థితి.. ఉన్న ఇద్దరు పిల్లలు అనాథలుగా మిగిలారు. వీరి పరిస్థితిని చూసి ఇంత చిన్న వయసులో ఎంత కష్టం? అని గ్రామస్తులు గుండెలు బాదుకుంటూ రోదిస్తున్నారు. నివసించేందుకు గూడు కూడా లేని పరిస్థితి. ఆ ఇద్దరు పిల్లల ఆర్తనాదాలు ప్రతి ఒక్కరి హృదయాన్ని కలచి వేస్తోంది.

పరమహంస యోగానంద విద్యాలయం విజయభేరి



ప్రజాశక్తి -శాంతిపురం: వరుసగా సిబిఎస్ఇ పదవ తరగతి 20వ బ్యాచ్ శ్రీపరమహంస యోగానంద విద్యాలయ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. విద్యాలయ ఫలితాలలో జి తేజశ్రీ - 475 (95శాతం)మార్కులతో మొదటిర్యాంక్, యన్‌యస్ వరుణ్ 460 (92 శాతం) మార్కులతో రెండవ ర్యాంక్ , కె.యస్. తేజశ్రీ రెడ్డి 439 (88శాతం) మార్కులతో మూడవ ర్యాంకు సాధించారు.

డిస్టింషన్స్ పొందిన విద్యార్థులు : 14,
ఫస్ట్ క్లాస్ పొందిన విద్యార్థులు : 21
సెకండ్ క్లాస్ పొందిన విద్యార్థులు: 4
మొత్తం విద్యార్థులు : 39

ఫలితాల పై విద్యాలయ చైర్మన్ గోపాల్ అగర్వాల్, విద్యాలయ ప్రిన్సిపాల్ ఆజాద్ హుస్సేన్ విద్యార్థులను, ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు.

21న మండల సర్వసభ్య సమావేశం


ఎంపిడివో మధుసూదన్‌రెడ్డి

ప్రజాశక్తి -రొంపిచర్ల: రొంపిచర్ల మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 21వ తేదీ బుధవారం ఉదయం 10.30లకు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎస్ మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. తాగునీరు , పారిశుధ్యం, ప్రాథమిక వైద్యం, ఆరోగ్యం, వ్యవసాయం, పశు సంరక్షణ, పశు సంవర్ధక శాఖ, విద్యుత్తు, గృహ నిర్మాణ శాఖ, రెవెన్యూ, పౌర సరఫరాలు, గ్రామీణ ఉపాధి హామీ, ప్రాథమిక విద్య, స్త్రీ శిశు సంక్షేమం, వెలుగు, గ్రామ పంచాయతీలు, జల వనరుల శాఖ, రోడ్లు, భవనాలు, రవాణా శాఖ, పంచాయతీ రాజ్, అటవీ శాఖ, ఉద్యానవనాల శాఖ, ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ, మత్స్యశాఖ తదితర అంశాలపై అభివృద్ధిపై చర్చించేందుకు అధికారులు, జెడ్పిటిసి, ఎంపీటీసీలు, గ్రామ సర్పంచులు, పంచాయతీ సెక్రటరీలు, అన్ని శాఖల అధికారులు పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో కోరారు.


డిప్యూటీ తహశీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న ప్రజలు

చెరువు కాలువ ఆక్రమణలు తొలగించండి


ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: చెరువు కాలువను సర్వే చేయించి వాటి ఆక్రమణలు తొలగించాలని పలువురు రైతులు డిప్యూటీ తహశీల్దారు తులసిరామ్ కు అర్జీ ద్వారా విన్నవించారు. మండలంలోని పాపిరెడ్డి పల్లె పంచాయతీ పరిధిలోని బయ్యారెడ్డి చెరువు నుండి ఇరగమరెడ్డి చెరువుకు వచ్చే కాలువను కొంతమంది రైతులు ఆక్రమించారని తెలిపారు. వర్షాలు పడినప్పుడు ప్రతిసారి ఆ నీళు చెరువుకు పోకుండా పక్కన ఉన్న రైతుల పొలాల్లోకి మళ్లి నష్టం కలిగిస్తున్నాయని చెప్పారు. అంతేకాకుండా ఈ చెరువు కాలువను రైతులు పొలాలకు వెళ్లే దారిగా కూడా వినియోగించుకుంటున్నామన్నారు. చెరువు కాలువ ఆక్రమణలు వెంటనే తొలగించాలని, రైతులు నష్టపోకుండా ఆదుకోవాలని అందువల్ల చెరువు కాలువను సర్వేచేసి సరిహద్దులు చూపాలని డిప్యూటీ తహశీల్దారును వారు కోరారు.

'మదర్ థెరిసా' ప్రభంజనం



ప్రజాశక్తి -పెద్ద పంజాణి: మండలంలోని మదర్ థెరిసా ని బి ఎ న్ ఈ పదవ తరగతి ఫలితాల్లో అద్భుత విజయం సాధించినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ ఎం రవీంద్ర బాబు మంగళవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరంలో మొదటి సారి పదవ తరగతి సీబీఎస్ఈ పరీక్షల్లో మదర్ థెరిసా పాఠశాల విద్యార్థులు పరీక్షలు రాసి వంద శాతం అద్భుత విజయం సాధించారని అన్నారు. పదో తరగతి విద్యార్థిని తనుజ 92.6 శాతం, ఎస్.చరిష్మా భాను,88.8 శాతం, వి.తేజల్ 88.8 శాతం మార్కులతో ఉత్తీర్ణుల య్యారన్నారు. తమ పాఠశాలలో తొలి సంవత్సరంలోనే అద్భుతమైన ఫలితాలు సాధించడం గర్వకారణం అని ర్యాంకులు సాధించిన విద్యార్థులు, వారిని ప్రోత్సహించిన తల్లిదండ్రులు ఉత్తమ విద్యా బోధన చేసిన ఉపాధ్యాయులందరికీ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ప్రిన్సిపల్ డేవిడ్ ఉపాధ్యాయుల బృందం విద్యార్థులను అభినందించారు. పాఠశాల నాణ్యమైన విద్యా ప్రమాణాలు, పెంపొందించడంలో నిష్ణాతులైన ఉపాధ్యాయుల మార్గదర్శం, విద్యార్థుల ఏకాగ్రత, శ్రద్ధ ఈ విజయానికి దోహదం చేశాయని ప్రిన్సిపాల్ డేవిడ్ అన్నారు.

జంతుబలికి అనుమతి తీసుకోవాలి: డిఎస్‌పి



ప్రజాశక్తి-కుప్పం టౌన్ : పోలీసుల అనుమతి, గుర్తింపు పొందిన వారు మాత్రమే జంతుబలి ఇవ్వాలని కుప్పం డిఎస్‌పి పార్థసారథి మంగళవారం తెలిపారు. కుప్పంలోని ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతర సందర్భంగా అమ్మవారికి భక్తులు పెద్ద ఎత్తున జంతు బలులు ఇవ్వడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఇందులో భాగంగా జంతువులను బలిచ్చే వ్యక్తులు ముందు పోలీసు వారి అనుమతి పొందాలని సూచించారు. 20 సంవత్సరాల వయస్సు పైబడిన వారికి మాత్రమే జంతువులను బలి ఇచ్చే అర్హత ఉంటుందని, ఆసక్తి గలవారు ఈ నెల 14, 15, 16 తేదీలలో వారి ఆధార్ కార్డు, ఒక పాస్ పోర్ట్ సైజు ఫోటో తీసుకుని వచ్చి పోలీస్ స్టేషన్‌లో ఐడి కార్డు తీసుకురావాలని సూచించారు. ఐడి కార్డు కలిగిన వ్యక్తులపై ఎలాంటి క్రిమినల్ కేసులు ఉండరాదని, క్రిమినల్ కేసులు ఉన్నవారికి ఐడి కార్డు ఇవ్వబోమని స్పష్టం చేశారు. ముఖ్యంగా జంతుబలులు ఇచ్చే వ్యక్తులు ఐడి కార్డు ధరించి, పోలీసుల అనుమతి పొందిన కత్తులను మాత్రమే ఉపయోగించాలని పేర్కొన్నారు. ఐడి కార్డులు వేరొకరికి బదిలీ చేయడం కుదరదని, పోలీసుల నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అదనపు పైపులు తెచ్చేది ఎప్పుడు?

- బోరు బావి నుండి నీరు వచ్చేనా?
- వారం రోజులుగా నీటి కోసం ప్రజల ఇబ్బందులు


బోరు బావి నుండి బయటకు తీసిన పైపులు

ప్రజాశక్తి-సోమల: సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ నూతన సచివాలయం ఎదురుగా ఉన్న కాలనీ ప్రజలకు, లక్ష్మీపురం గ్రామంలోని ప్రజలకు తాగునీరు అందించే బోరు బావిలో నీటిని పైపులు అందుకోకపోవడంతో అదనపు పైపులను ఏర్పాటు చేయాల్సి వచ్చింది. దీంతో వారం రోజులుగా బోరు బావిలోని పైపులను బయటకు తీసి వేశారు. అయితే రెండు బోరు బావుల్లో నూతన పైపులను ఏర్పాటు చేస్తేనే పైపులకు నీరు అంది ప్రజలకు తాగునీరు వచ్చే అవకాశం వుంది. నూతన పైపులను త్వరితగతిన కొనుగోలు చేసి బోరు బావులలో ఏర్పాటు చేసి ప్రజలకు తాగునీరు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

వీల్ చైర్ వితరణ


వీల్ చైరును అందిస్తున్న లయన్స్‌క్లబ్ ఆఫ్ వారియర్స్

ప్రజాశక్తి-కుప్పం రూరల్ : కుప్పం మండలం కంగుంది గ్రామానికి చెందిన వృద్ధుడికి కుప్పం లయన్స్ క్లబ్ ఆఫ్ వారియర్స్ ఆధ్వర్యంలో మంగళవారం లయన్స్ క్లబ్ ఆఫ్ వారియర్స్‌వీల్ చైర్ వితరణగా అందించారు. ఈ సందర్భంగా క్లబ్ సలహాదారు మహేష్ మాట్లాడుతూ కంగుంది గ్రామానికి చెందిన మణి అనారోగ్యంతో బాధపడుతూ లేవలేని స్థితికి చేరాడన్నారు. ఆయన పరిస్థితిని తెలుసుకున్న క్లబ్ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం వీల్ చైర్ వితరణకు ముందుకు వచ్చినట్లు తెలిపారు. క్లబ్ అధ్యక్షులు సోమ శేఖర్ మాట్లాడుతూ వీల్ చైర్ వితరణ చేసిన దాతకు క్లబ్ తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు సత్యేంద్ర శేఖర్, డైరెక్టర్ సెల్వం, శివ, సర్పంచ్ ధనశేఖర్, స్థానిక నాయకులు దివాకర్, షరీఫ్, నవీన్, కార్తీక్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ప్రజాశక్తి -యాదమరి: వేసవికాలంలో వడదెబ్బ బారిన పడకుండా ప్రజలు ఎలా మెలగాలన్న విషయంపై యాదమరి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ అవగాహన కల్పించారు. మంగళవారం యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వరదరాజులపల్లి హరిజనవాడలోని ప్రజలకు వేసవికాలంలో వడదెబ్బ బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అన్నదానిపై ఆయన మాట్లాడుతూ ఎండలు విపరీతంగా ఉందని రైతులు, రైతు కూలీలు, పశువులు, గొర్రెల కాపరులు ఉదయం 10.30 గంటలకల్లా తమ పనులు ముగించుకొని ఇళ్లకు చేరుకోవాలన్నారు. అనంతరం సాయంకాలం నాలుగున్నర గంటల పైన పొలం పనులకు వెళ్లాలని అత్యవసరమైతే తప్ప మిగిలిన సమయంలో బయట ఎక్కడా తిరగరాదన్నారు. ఒకవేళ ఎవరైనా అధిక ఎండలో తిరిగి వడదెబ్బకు గురైతే సత్వరం వారికి ఓఆర్ఎస్ ద్రావణాన్ని స్థాపించాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు మీ గ్రామా నికి వచ్చే మహిళా ఆరోగ్య కార్యకర్త వద్ద, ఆశా కార్యకర్త వద్ద, అంగన్వాడి వర్కర్ వద్ద, దుకా ణాల్లో కూడా ఉచితం గా అందిస్తాం న్నారు. ఈ ఓ ఆర్ ఎస్ తాగిన తర్వాత కూడా నీరసంగా ఉంటే సత్వరం సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి గాని లేక చిత్తూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి 108 అంబులెన్స్ ద్వారా ఆ వ్యక్తిని తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ లక్ష్మీ నారాయణ, ఏఎన్ఎంలు , సూపర్వైజర్లు, వర్కర్స్ పాల్గొన్నారు.

భద్రతా సేవలు అత్యంత కీలకం: ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలో గన్ మ్యాన్‌లుగా విధులు నిర్వహిస్తున్న వారికి మూడురోజుల పాటు ఐఎస్‌డబ్ల్యూ వారిచే పోలీస్ ట్రైనింగ్ సెంటర్లో శిక్షణా తరగతులు నిర్వహించారు. మంగళవారం శిక్షణా తరగతుల ముగింపు రోజున జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ముఖ్యఅతిథిగా పాల్గొని శిక్షణలో పాల్గొన్న గన్‌మెన్‌లతో మాట్లాడారు. ప్రత్యేక భద్రతా సిబ్బందిగా మీరు అందించే భద్రతా సేవలు అత్యంత కీలకమైనవని, ప్రజాప్రతినిధులకు, వీఐపీలకు మీరు నిస్వార్థంగా అందించే రక్షణ, వారి ప్రాణాలను కాపాడే ధైర్యత, చిత్తశుద్ధి చాలా ముఖ్యమైనవని అన్నారు. మీరు కేవలం ఒక వ్యక్తిని కాదని ఒక వ్యవస్థను, ప్రజాస్వామ్యాన్ని, పాలనలో నైతికతను రక్షిస్తున్నారని పేర్కొన్నారు. అందుకే మీ వైఖరిలో నైతిక బలం ప్రతిఫలిం చాలని అందుకు శారీరకంగా, మానసికంగా ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉండాలని సూచించంఆరు. విధిలో ఉండే సమయంలో పిఎస్ఓలు ఆయుధ వినియోగంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని, ఆయుధ వినియోగానికి ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అపాయ నివారణ మార్గాలపై పూర్తి అవగాహన అవసరమన్నారు. శారీరక దృఢత్వం కోసం నిత్య శిక్షణ, వ్యాయామం, సమన్వయంతో కూడిన కదలికలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

స్పెషల్ ఆఫీసర్ తనిఖీలో బయటపడ్డ సిబ్బంది గైర్హాజరు

తీరు మార్చుకోకుంటే చర్యలు..
ప్రత్యేక అధికారి గౌరీ హెచ్చరిక

ప్రజాశక్తి- సోమల: జిల్లా స్థాయి టూరిజం శాఖ అధికారిని, సోమల ప్రత్యేక అధికారి గౌరీ మంగళవారం సోమల సచివాలయాన్ని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది గైర్హాజర్‌పై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మొదట అంగన్వాడి కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించి సలహాలు సూచనలు అందజేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించి సిబ్బంది ప్రజలకు వైద్యసేవలు అందించడంలో ఎలాంటి లోటుపాట్లు రాకూడదని ఒకటి రెండు ఆరోపణలు తన దృష్టికి వస్తున్నాయని వాటిని సరి చేసుకోవాలని హెచ్చరిం చారు. అనంతరం సోమల బజారు వీధిలోని సచివాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేయగా ఒక్కరు కూడా సిబ్బంది లేకపోవడం గమనించి ఒకింత ఆశ్చర్యానికి గురయ్యారు. అనంతరం సోమల ఇన్చార్జి పంచాయతీ కార్యదర్శి జయశంకర్ హుటాహుటిన కార్యాలయానికి రాగా రికార్డులు పరిశీలించి ఎందుకు సిబ్బంది రావడం లేదని ఒకేసారి అందరికీ లీవులు ఎందుకు ఇచ్చారని మూమెంట్ రిజిస్టర్‌లో ఇంతవరకు ఎందుకు ఎక్కడికి వెళ్తున్నారన్న విషయాలను నమోదు చేయలేదని ప్రశ్నించారు. ఓవర్ హెడ్ ట్యాంకులు క్లీన్ చేసి వాటి ఫోటోలు అతికించాలని తెలియదా? అంటూ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్షల రూపాయలు వెచ్చించి ప్రభుత్వం సచివాలయాలను నిర్మించి పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించి ప్రజలకు అన్ని విధాల సేవలు అందజేయాలని ఆశిస్తే ఇక్కడికి సిబ్బంది మాత్రం సరైన సమయానికి విధులకు హాజరుకాకుండా ఇష్టానుసారం లీవులు పెట్టి అలసత్వం వహిస్తున్నారని ఇకపై అలా కాకుండా నోటీసు బోర్డులో ఏ అధికారి ఎక్కడికి వెళ్ళాడు ఎప్పుడు వస్తాడో అన్న వివరాలను కచ్చితంగా ప్రజలకు తెలియజేయాలని లేనిపక్షంలో తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ షౌకత్ ఆలీ, సూపర్వైజర్ హరిత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దూదేకుల ముస్లిం మైనార్టీలకు తీవ్ర నష్టం

- దూదేకుల గుండుమల్లి గఫూర్



ప్రజాశక్తి- వెదురుకుప్పం : ముస్లిం మైనార్టీ కేటగిరీలో తక్షణమే బిసిబి దూదేకుల ఆప్షన్ పొందుపరిచేలా చర్యలు తీసుకోవాలని, ఈ సాంకేతిక లోపం కారణంగా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలకు వేల మంది దూదేకుల ముస్లింలు దూరం అవుతున్న సంగతి ప్రభుత్వం గుర్తించాలని నూర్ బాషా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గఫూర్ పేర్కొన్నారు. ఈ సాంకేతిక లోపం కారణంగా మైనార్టీ సబ్సిడీ రుణాలు మైనార్టీ గ్రూపులలో ప్రవేశాలు మైనార్టీ కోటాలో కో ఆప్షన్ సభ్యత్వం షాదీ తోఫా వంటి పథకాలు ముస్లిం మైనార్టీలకు అందాల్సిన ప్రయోజనాలు ఈ కారణంగా దూరమయ్యే పరిస్థితి వుందన్నారు. దూదేకుల ముస్లిం సమాజం ప్రభుత్వం నుండి పదే పదే నిర్లక్ష్యా నికి గురవుతోందని, వివక్షను ఎదుర్కొంటోందని ఆన్లైన్లో వెబ్సైట్ల లో మైనార్టీ రుణాల కేటగిరిలో దూదేకుల లద్దాఫ్ పింజారి నూర్ బాషా వంటి బిసిబి కేటగిరి లోని మైనార్టీ కులాలకు సంబంధించిన ఆప్షన్ లేక పోవడం వల్ల లక్షలాది దూదేకుల ముస్లింలకు అన్యాయం జరిగే విషయాన్ని తక్షణమే ప్రభుత్వం సరిదిద్దకపోతే రాష్ట్రవ్యాప్తంగా వున్న నూర్ బాషా ముస్లింలు ఉద్యమం చేపడుతారని హెచ్చరించారు.

రైళ్లు ఆపి అందుబాటులోకి తీసుకురావాలి

సాయి మాతా సేవా ట్రస్ట్ అధ్యక్షులు జగదీష్ బాబు



ప్రజాశక్తి- కుప్పం టౌన్ : కుప్పం పరిసర ప్రాంత ప్రజల సౌకర్యార్థం కుప్పం మీదగా ప్రయాణించే రైళ్లను కుప్పంలో ఆపాలని, నూతన రైళ్లను ప్రారంభించాలని సాయి మాత సేవ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు జగదీష్ బాబు రైల్వే బెంగళూరు డివిజనల్ రైల్వే మేనేజర్ అశుతోష్ కుమార్ సింగ్ కు విన్నవించుకున్నట్టు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రతినిత్యం పలు కార్యక్రమాలపై కుప్పం పరిసర ప్రాంతాల నుండి బెంగళూరుకు వేలాది మంది ప్రయాణిస్తున్నట్టు తెలిపారు. అయితే ఉదయం 6:45 గంటలకు పుష్పుల్ రైలు ఉందని, అనంతరం 10 గంటలకు శేషాద్రి ఎక్స్‌ప్రెస్ రైలు వచ్చే వరకు ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా రోజువారి కూలీ పనుల నిమిత్తం అధికంగా ప్రజలు బెంగళూరు వెళ్తున్నారని, వారి సౌకర్యార్థం పుష్పుల్ అనంతరం శేషాద్రి ఎక్స్‌ప్రెస్‌ను రైలుకు ముందు మరో పుష్పుల్ రైలును ఏర్పాటు చేయాలని కోరారు. బెంగళూరు నుంచి బయలుదేరు హంస ఫర్ ఎక్స్‌ప్రెస్, ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ లను కుప్పంలో నిలిపితే ప్రయాణికులకు పూర్తి సౌకర్యం కలుగుతుంది అన్నారు. ముఖ్యంగా కుప్పం పట్టణంలో వెలసిన ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతర ఆరంభమైందని, దక్షిణ భారతదేశంలోనే ప్రత్యేకత కలిగిన కుప్పం లో జరిగే అమ్మవారి జాతరకు సుదీర్ఘ ప్రాంతాల నుండి భక్తులు వస్తారని చేస్తారని, వారి సౌకర్యార్థం కుప్పం మీదగా ప్రయాణించే ప్రతి రైలును ఒక్క నిమిషం పాటు కుప్పంలో నిలుపుదల చేయడానికి అధికారు లు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుప్పిగానిపల్లి నాగరాజు నాయుడు, కిషోర్ కుమార్, గుత్తార్లపల్లి సురేష్ పాల్గొన్నారు.

క్రైం న్యూస్

నాటు సారా స్వాధీనం

- వ్యక్తి అరెస్టు


పోలీసుల అదుపులో నాటుసారా విక్రయదారుడు

ప్రజాశక్తి -పుంగనూరు: అమ్మకానికి సిద్ధంగా ఉంచిన 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని వ్యక్తిని అరెస్టు చేసినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె సురేష్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ నిర్వహించిన దాడులలో పుంగనూరు మండలం పత్రాపల్లె తండాకు చెందిన మునుస్వామి కుమారుడు ఎం మురళి నాయక్ వద్ద 20 లీటర్లు నాటు సారా తయారు చేసి అమ్మకానికి సిద్ధంగా ఉంచడంతో దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. నాటు సారా తయారీకి పనికి వచ్చే 100 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు చెప్పారు. ఈ మెరకు కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. ఈ దాడులలో ఎస్‌ఐ సతీష్, వేణుగోపాల్ రెడ్డి, సిబ్బంది సుబ్రహ్మణ్యం, నాగరాజు, కిషోర్ కుమార్, సురేంద్ర, వెంకటేష్ పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీ కొన్న లారీ

యువకుడు మృతి


ఎ గిరిబాబు (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి -కార్వేటినగరం: ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు..కొటార్వేడు గ్రామానికి చిన్నబ్బ కుమారు ఎ.గిరిబాబు (29)కు ఐదు సంవత్సరాల క్రితం తమిళనాడులోని తిరుత్తణికి చెందిన దివ్య(మౌనిక)తో వివాహమైంది. ఆమె అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆమెను కొన్నాళ్ల క్రితం విశ్రాంతి తీసుకోవడానికి పుట్టింటికి పంపించారు. మంగళవారం సాయంత్రం భార్యను చూసేందుకు తిరుత్తణికి ద్విచక్రవాహనంలో బయలు దేరాడు. మార్గ మధ్యంలో కొల్లాగుంట ఏఎడబ్ల్యూ సమీపంలో చిత్తూరు- పుత్తూరు జాతీయ రహదారిపై వెళుతుండగా పుత్తూరు నుంచి చిత్తూరుకు ఇనుప కమ్ముల (స్టీల్) లోడ్డుతో వెళుతున్న లారీ ద్విచక్రవాహనాన్ని వెనుక వైపు నుంచి ఢీ కొంది. దీంతో సుమారు 10 అడుగుల వరకు మృతదేహాన్ని లాక్కెళ్లడంతో మృత దేహం ఛిద్రమైంది. స్థానికులు మృతుడు కొటార్వేడు గ్రామానికి చెందిన గిరిబాబుగా గుర్తించారు. దీంతో సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకుని కన్నీమున్నీరుగా విలపించడంతో ఆ ప్రాంతం శోక సంద్రంగా మారింది. భార్య కూడా మూడు నెలలు గర్భవతిగా ఉన్నట్లు సమాచారం. సమాచారం అందుకున్న ఎస్‌ఐ రాజుకుమార్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

సిబిఎస్ ఫలితాల్లో సత్తా చాటిన బృందావన్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: మంగళవారం విడుదలైన సిబిఎస్ పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో సంతపేట నాగాలమ్మ గుడి వద్ద వున్న బృందావనం సిబిఎస్ స్కూల్ విద్యార్థులు 473/500, 472/500 అత్యధిక ఫలితాలను సాధించారని కరస్పాండెంట్ శైలజ కుమారి తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. అలాగే 100 శాతం ఉత్తీర్ణత సాధించాటానికి సహకరించిన ఉపాధ్యాయ బృందానికి అభినందనలు తెలిపారు.

ప్రభుత్వాస్పత్రిని తనిఖీ చేసిన కలెక్టర్



ప్రజాశక్తి- పూతలపట్టు: పూతల పట్టు మండలం పి.కొత్తకోట లోని ప్రభుత్వ ప్రజాఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. మొదటగా ఆసుపత్రిలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించి సంబంధిత అధికారులను వివరా లు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రికి సంబంధిం చిన పలు రికార్డులను తనిఖీ చేశారు. పలువురు ఆసుపత్రికి వచ్చే రోగులతో మాట్లాడి వైద్య వివరాల సమాచారాలను అడిగి తెలుసుకున్నారు. జాతీయ రహదారి పక్కన ఉన్న ఆసుపత్రికి రాత్రి సమయాల్లో కూడా వైద్యులు అందుబాటులో ఉండాలని సూచించారు. ఆయన వెంట పలువురు అధికారులు ప్రజాప్రతినిధులు ఉన్నారు.

మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రభుత్వ సేవలను సులభతరం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌కు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ సుమిత్ కుమార్ ఆవిష్కరించారు. మంగళవారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌కు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌరసేవలు అందుబాటులోకి తెచ్చేందుకు వాట్సాప్ నంబర్ 95523 00009ను కేటాయించారని తెలిపారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించేందుకు, వారికి అవసరమైన సమాచారాన్ని చేరవేసేందుకు వీలుగా వాట్సప్ పరిపాలన (వాట్సాప్ గవర్నెన్స్) ప్రారంభమైందన్నారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌డిఓ రవి కుమార్ పాల్గొన్నారు

సివిల్ డిఫెన్స్ వాలంటీర్లుగా రిజిస్టర్ చేసుకోవాలి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: మై భారత్ వెబ్ సైట్ లో సివిల్ డిఫెన్స్ వాలంటీర్లుగా రిజిస్టర్ చేసుకోవాలని యువతను ఉమ్మడి చిత్తూరు జిల్లా నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి బి ప్రదీప్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, మై భారత్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా యువత దేశానికి ఉపయోగపడే విధంగా ముఖ్యంగా అత్యవసర పరిస్థితులు, సంక్షోభ సమయాల్లో కీలకపాత్ర పోషించడానికి సాధికారత కల్పించే సమిష్టి ప్రయత్నంలో భాగంగా ప్రకృతి వైపరీత్యాలు ప్రమాదాలు, ప్రజాత్యవసర పరిస్థితులు, ఊహించని పరిస్థితుల్లో ప్రతిస్పందించే విధంగా స్వచ్ఛంద సేవకులను నిర్మించడమే లక్ష్యంగా మై భారత్ సివిల్ డిఫెన్స్ వాలంటీర్‌గా నమోదు చేసుకోవడానికి ఇది ఒక సువర్ణ అవకాశం అని అన్నారు.